



బహిరంగ సభ స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా స్థాయి అధికారులు

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రైతు భరోసా- పిఎం కిసాన్ సొమ్ము విడుదల చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి నవంబర్ 7న రానున్న నేపథ్యంలో సిఎం పర్యటనా ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులతో కలసి ఆదివారం స్థానిక ఎయిర్‌పోర్టు, కాన్వాయ్ రహదారి, మైదానంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణం తదితర ప్రాంతాలను పరిశీలించారు. బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు, పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బందాలతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, ఆర్డీవో భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్, ఇంటెలిజెన్సీ అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు : సిఎం పర్యటన నేపథ్యంలో పటిష్టబందోబస్తును ఏర్పాటుచేసినట్లు ఎసీ తెలిపారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 40 మంది సిఐలు, 121 మంది ఎస్ఐలు, 242 మంది ఎఎస్ఐలు / హెడ్ కానిస్టేబుళ్లు, 509 మంది కానిస్టేబుళ్లు, 96 మంది మహిళా పోలీసులు, 244 మంది హోంగార్డులు, 3సెక్షన్ల ఎఆర్ పోలీసులు, 8 స్పెషల్ పార్టీ పోలీసు బృందాలను బందోబస్తు విధులకు కేటాయించామని ఎస్పీ చెప్పారు.

సిఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 7న పుట్టపర్తికి వస్తున్న సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద జరుగుతుండడంతో, కొత్తచెరువు, గోరంట్ల వైపు నుండి పుట్టపర్తికి వచ్చే వాహనాలను సూపర్ స్పెషాలిటీ వద్ద నుండి బ్రాహ్మణపల్లి ఎనుములపల్లి మీదుగా పుట్టపర్తికి మళ్లిస్తున్నామన్నారు. అదేవిధంగా నల్లమాడ, బుక్కపట్నం వైపు నుండి పుట్టపర్తికి వచ్చే వాహనాలను, కొత్తచెరువు, గోరంట్ల బెంగళూరుకు వెళ్లే వాహనాలు గణేష్ సర్కిల్ నుండి బ్రాహ్మణపల్లి మీదుగా వయా హాస్పిటల్ వైపునకు వెళ్లే విధంగా మళ్లిస్తున్నామన్నారు. వాహనదారులు గమనించాలని వారు కోరారు.

నేడు టిడిపి కరువు పరిశీలన బృందం పర్యటన

మడకశిర : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో సోమవారం(నేడు) టిడిపి కరువు పరిశీలన బృందం నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు మనోహర్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు లేక పంటలు ఎండిపోయి దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, కోన రవికుమార్, రామకృష్ణారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కాలవ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథిలతో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించేందుకు 6వ తేదీ మండల పరిధిలోని ఉగ్రేపల్లి, కోడిగానిపల్లి, బేగార్లపల్లి, తదితర గ్రామాల్లో పర్యటి స్తుందని తెలిపారు. కావున ఐదు మండలాలు, మున్సిపాలిటీకి సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఫార్మసీ విభాగంలో ఇద్దరే..!

వేధిస్తున్న సిబ్బంది కొరత
అన్నింటా శిక్షణ విద్యార్థులే...
మందులు మారితే బాధ్యులెవరు..?



జిల్లా అసుపత్రిలో మందుల కోసం క్యూ కట్టిన రోగులు



మందులు ఇస్తున్న శిక్షణ విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఫార్మసీ విభాగంలో ఐదుగురు సిబ్బంది ఉండాల్సిన చోట ఇద్దరే ఉన్నారు. దీంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల డి-ఫార్మాసి చదువుతూ అసుపత్రిలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు ఉద్యోగుల్లా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్యులు రాసిన మందులు కాకుండా వేరే మందులు శిక్షణ విద్యార్థులు రోగులకు ఇస్తే దానికి భాధ్యత ఎవరు తీసుకుంటారన్నది జిల్లా అసుపత్రిలో అందరి నోట వినిపిస్తున్నమాట...

శ్రీ సత్య సాయి జిల్లాలో జిల్లా స్థాయి హోదా హిందూపురం ప్రభుత్వ అసుపత్రికి ఉంది. అయితే హోదాకు తగ్గట్టు సిబ్బంది లేకపోవటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ అసుపత్రికి హిందూపురం పట్టణ ప్రజలే కాకుండా మడకశిర, పెనుకొండ, గోరంట్ల తదితర ప్రాంతాలతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి సైతం ఇక్కడి వైద్య సేవల కోసం వస్తుంటారు. రోజుకు కనీసం 800 నుంచి వెయ్యిమంది వరకు రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను రాసి ఇస్తారు. ఈ మందుల పంపిణీ కోసం ప్రభుత్వం ఒక ఫార్మసీ సూపర్‌వైజర్, ఒక గ్రేడ్1 ఫార్మాసిస్టు, ముగ్గురు గ్రేడ్-2 ఫార్మాసిస్టులు మొత్తం ఐదుగురిని కేటాయించింది. అయితే ఇక్కడ ఫార్మసి సూపర్‌వైజర్ మాత్రమే ఉన్నారు. గ్రేడ్-1 ఫార్మాసిస్టు పోస్టు ఖాళీగా ఉంది. ముగురు గ్రేడ్-2 ఫార్మాసిస్టులు ఉండాల్సుండగా కాంట్రాక్టు పద్ధతిన ఒకరిని నియమించారు. ఇంత పెద్ద అసుపత్రికి కేవలం ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరే అసుపత్రిలో 7 వార్డులకు, సిఒటికి అవసరమైన మందులను అందిచాల్సుంది. దీంతో పాటు ఇచ్చిన ఇండెంట్ మేరకు మందులు వచ్చాయాలేదా అని చూసుకోవాల్సుంది. మందులు తక్కువ వస్తే చుట్టు పక్కన ఉన్న ఏరియా, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నుంచి అవసరమైన మందులను తెప్పించుకుని, వీరికి సరఫరా అయిన వెంటనే వారికి ఆ మందులను పంపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి రాసి ఇచ్చిన మందులను రోగులకు ఇవ్వాల్సిన బాధ్యతను శిక్షణ విద్యార్థులకు అప్పగించారు. శిక్షణ కోసం వచ్చిన విద్యార్థులు వైద్యులు రాసిన మందులు అర్థం కాక ఇతర మందులను రోగులకు ఇస్తే దాని భాధ్యత ఎవరు తీసుకోంటారన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు స్పందించి ఆసుపత్రిలోని ఫార్మసీ విభాగానికి వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి, శిక్షణ కోసం వస్తున్నా విద్యార్థులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వచ్చే రోగులకు నాణ్యమైన మందులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నింలా విద్యార్థులే : హిందూపురం పట్టణంలో బాలికల పాలిటెక్నిక్ కళాశాల ఉంది. ఈ కళాశాలలో రెండు సంవత్సరాల కాల వ్యవదితో డి-ఫార్మసీ కోర్సు ఉంది. ఆ విభాగంలో 55 మంది విద్యార్థులకు గాను ప్రస్తుతం 42 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. రెండు సంవత్సరాలు పూర్తి అయిన విద్యార్థులకు ఫార్మసి కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఫార్మసి కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు మూడు నెలల పాటు వివిధ ప్రభుత్వ అసుపత్రుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అలా శిక్షణ కోసం వచ్చిన విద్యార్థులను పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాల్సిన ఫార్మసి విభాగం వారు అన్నింటా విద్యార్థులను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నారు. శిక్షణలో ఉన్న విద్యార్థుల పక్కన ఫార్మసిస్టులు ఉండి మందులకు సంబందించి సమగ్రంగా వివరించాల్సిన అవసరం ఉంది. అయితే సిబ్బంది పూర్తి స్థాయిలో లేక పోవడంతో శిక్షణ విద్యార్థులనే అన్నింట వినియోగించుకుంటున్నారు.

15న సిపిఎం 'ప్రజారక్షణభేరి' బహిరంగ సభ



ప్రజారక్షణభేరి' కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ విజయవాడలో చేపట్టనున్న 'ప్రజారక్షణభేరి' బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రా లను విడుదల చేశారు. పెద్దన్న మాట్లాడుతూ సిఎం జగన్ కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్రాన్ని ప్రశ్నించకపోగా వారు చెప్పినట్టు తలాడిస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు, ఆస్తి, చెత్త పన్ను, ఇలా ఇష్టం వచ్చినట్లు ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారన్నారు. 'నవరత్నాలు' తప్ప నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం, గిట్టుబాటు లేని వ్యవసాయం, రక్షణ కరువైన చేతువృత్తులు, కౌలురైతులు ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. పైగా విద్యుత్ ఛార్జీలు, ఇసుక ధరలు పెంచి ఉపాధిని దెబ్బతీస్తుందన్నారు. వైసిపి పాలనలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని, నిరసనలు తెలియజేయడానికి వీలులేకుండా నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు, బైండోవర్ కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి కూడా కేంద్రంపై పల్లెత్తు మాట అనకపోగా పార్లమెంటులో బిజెపిని బలపరుస్తుందన్నారు. ప్రమాదంలో పడిన రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలన్నా, సామాన్యులకు ఊరట లభించాలన్నా ప్రజలు ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక ప్రధాన కూడలిలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సహాయ కార్యదర్శి వెంకటేష్, కొండా వెంకటేష్, బెస్త కిష్టప్ప, కె.కృష్ణప్ప, శీలా నారాయణస్వామి, మాబు, నాగభూషణ, సంజీవప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేసే పార్టీలకే మద్దతు

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్

ప్రజాశక్తి -పెనుకొండ

ఒపిఎస్‌ను పునరుద్ధరించే పార్టీలకే రాబోయే ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యుటి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసిపి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ఆదివారం యుటిఎఫ్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రవీంద్ర భారతి స్కూల్ ఆవరణలోని ఎంఎస్ఆర్ రెసిడెన్సీలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ సిఎం జగన్ నేటికీ ఒపిఎస్‌ను అమలు చేయక పోగా జిపిఎస్ విధానం తీసుకురావడం సమంజసం కాదన్నారు. 'ఓట్ ఫర్ ఒపిఎస్' నినాదంతో ముందుకెళ్తామన్నారు. ఏ రాజకీయ పార్టీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తుందో, జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తుందో ఆ పార్టీకే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మద్దతిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన మండల కమిటీ గౌరవాధ్యక్షులుగా పి.కృష్ణనాయక్, అధ్యక్షులుగా



సమావేశంలో పాల్గొన్న నాయకులు

యుపి.ఉపేంద్ర, ప్రధాన కార్యదర్శిగా రమేష్, సహాధ్యక్షులుగా వి.రామాంజనేయు లు, ఎం.నాగమణి, కోశాధికారిగా ఆదిజినేష్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి మండలాల యుటిఎఫ్ నాయకులు రవీంద్ర, నరసింహుడు, హసీనాబేగం, రాధామణి, బాబు, నరేష్, నాగేంద్ర, నరేష్, మారుతి, శేషాద్రి, దేవీ, గౌరమ్మ, రామకృష్ణనాయక్, లక్ష్మానాయక్, ఓబిలేసు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



టౌన్‌ప్లానింగ్ కార్యాలయంలో ఎసిబి అధికారులు

కొనసాగుతున్న ఎసిబి దాడులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో మూడవ రోజైన ఆదివారం కూడా ఎసిబి సోదాలు కొనసాగాయి. రెండు రోజుల పాటు రికార్డులను సమగ్రంగా పరిశీలించిన బృందం ఆదివారం క్షేత్రస్థాయిలో పట్టణంలో వివిధ ప్రాంతాలకు వెళ్లి టౌన్ ప్లానింగ్ అనుమతుల మేరకు భవన నిర్మాణాలు జరిగినాయా లేదా అని పరిశీలించారు. ఎసిబి అధికారులు ఒక్క టౌన్ ప్లానింగ్ విభాగంపైనే ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా పరిశీలన చేస్తున్న నేపథ్యంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ సోదాలు ఇంకా కొనసాగుతాయని అధికారులు పేర్కొనడం గమనార్హం. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలను మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి తమ పరిధిలో ఉండే 70 నుంచి వంద ఇళ్లు అనుమతులకు విరుద్ధంగా ఉన్నాయని, వీటిని గుర్తించకుండా విధులు ఎలా నిర్వహిస్తున్నారని అధికారులు అగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సోదాల్లో ఎసిబి సిఐ మోహన్‌ప్రసాద్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు

అధ్వానంగా గ్రామీణ రహదారి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నుంచి లేపాక్షికి వెళ్లే రహదారిలోని శ్రీకంఠపురం చెరువు కట్టపై ఏపుగా పెరిగిన కంపచెట్లతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంపచెట్ల కొమ్మలు ద్విచక్ర వాహనదారులకు తగిలి ఇబ్బంది పడుతున్నారు.నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రహదారిలో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి

జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎమ్. వీర్రాజు

ప్రజాశక్తి అనంతపురం

జిల్లాలో రోడ్డు భద్రతే ప్రధాన అజెండాగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ దిశగా అనంతపురం జిల్లా రవాణా శాఖ సమిష్టిగా కృషి చేస్తోందని రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎమ్. వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : అనంతపురం జిల్లాలో రోడ్డు భద్రత వారోత్సవాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాం. ప్రధానంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం కలిగించే చర్యలు తీసుకున్నాం.

ప్ర : జిల్లాలో ఎన్ని రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి ?

జ : అనంతపురం జిల్లాలో జిల్లా కేంద్రంలోని డిప్యూటీ రవాణా శాఖ అధికారి కార్యాలయంతో పాటు తాడిపత్రిలో యూనిట్ కార్యాలయం, గుంతకల్లు, రాయదుర్గంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు అందుబాటులో ఉన్నారు.

ప్ర : రవాణా శాఖ ప్రజలకు ఎన్ని రకాల సేవలందిస్తోంది ?

జ : ప్రభుత్వ రవాణా శాఖ ద్వారా ప్రజలకు 82 రకాల సర్వీసులు అందుతున్నాయి. లైసెన్సులు, ఫిట్నెస్, రిజిస్ట్రేషన్, లైఫ్ టాక్స్, క్వాటర్లీ టాక్స్ ఇలా 82 రకాల సర్వీసులను రోడ్డు రవాణా శాఖ ప్రజలకు అందిస్తోంది.

ప్ర : ప్రజల నుండి పన్నులను ఎలాంటి సందర్భాల్లో వసూలు చేస్తున్నారు ?

జ : వాస్తవానికి రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి రోడ్డు భద్రత నియమాలను పాటించే క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించడం రవాణా శాఖ ముఖ్య ఉద్దేశం. అయితే నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం సంబంధిత అపరాధ రుసుము వసూలు చేయడం రవాణా శాఖ బాధ్యత. అందులో భాగంగా ఈ ఏడాది ప్రభుత్వానికి రూ. 287 కోట్ల అపరాధ రుసుము ద్వారా అందించేందుకు లక్ష్యాన్ని నిర్ధారించుకున్నాం. అందులో ఇప్పటివరకు దాదాపుగా 50 శాతం పైగా వసూలు చేయడం జరిగింది. అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

ప్ర : ఆన్‌లైన్ పరంగానే అన్ని సేవలు అందుతున్నాయా..?

జ : నూతన సమీకరణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 82 సర్వీసులను ప్రజలకు అందిసోంది. అందులో మూడు రకాల సర్వీసుల కోసం ప్రజలు తప్పనిసరిగా కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. మిగిలిన సర్వీసులను ఆన్‌లైన్ ద్వారా పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. డ్రైవింగ్, లైసెన్సు, ఫిట్నెస్, ఎల్ఎల్ఆర్, ఆధార్, ఫిట్నెస్ వెహికల్, ట్రాన్స్‌పర్, డెత్ సర్టిఫికెట్ వంటి వాటికోసం మాత్రమే రవాణా శాఖ కార్యాలయానికి ప్రజలు రావాల్సి ఉంటుంది.

ప్ర : కొత్త విధానాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూతున్నదా.?

జ : రాష్ట్ర ప్రభుత్వం వాహన్, సారధి పోర్టర్లను ప్రారంభించడంతో ప్రజలకు ఇటు ప్రభుత్వానికి ఉపయోగకరమైన వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఈ పోర్టల్ ద్వారానే అన్ని సేవలు అందుతున్నాయి. ఇప్పటివరకు 50 శాతం రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ చేయడం జరిగింది. ఆన్‌లైన్ సేవల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు అసౌకర్యాలు కలవకుండా అప్లికేషన్ వేసిన కష్టమర్లు ఆన్‌లైన్ అప్లోడ్ స్థాయిలో ఏవో, ఆర్టీవో స్థాయి అధికారుల పరిశీలన ద్వారా పూర్తిస్థాయిలో నిర్ధారించబడతాయి. కాబట్టి రవాణా శాఖ సేవలు పారదర్శకంగా ప్రజలకు అందుతున్నాయి.

ప్ర : జిల్లాలో వాహనాలు ఎన్ని ఉన్నాయి.?



జ : అనంతపురం జిల్లాలో 4.30 లక్షల నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు, 58వేల ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఉన్నాయి. వివిధ కారణాలవల్ల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 100 వాహనాలను సీజ్ చేశాం. ఆ వాహనాలను వేలం ద్వారా మార్కెట్లో అమ్మడం జరుగుతుంది. టెంపరరీ రిజిస్ట్రేషన్ లేకుండా రోడ్డుపై తిరిగే వాహనాలపై, సంబంధిత డీలర్లపై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : జిల్లాలో ఎంతమంది వాహన డీలర్లు ఉన్నారు?

జ : అనంతపురం జిల్లాలో రెండు, మూడు, నాలుగు చక్రాల వాహన డీలర్లు 73 మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 24 కిలో వాట్స్ తక్కువ ఉండే ఎలక్ట్రికల్ బైక్ లకు జులై 2023 నుండి టాక్స్ అమలు చేస్తోంది. అంతకుమునుపు కొన్న వాహనాలకు లైసెన్సు, రిజిస్ట్రేషన్ అవసరం లేదు.

ప్ర : ఇటీవల కాలంలో రవాణా శాఖ మీద పలు అభియోగాలు వచ్చాయి. వాటిపై మీ స్పందన .?

జ : ప్రభుత్వ శాఖల్లో ఇలాంటి అభియోగాలు మామూలుగా వినపడుతుంటాయి. అయితే ఒక ఉన్నత స్థాయి అధికారిగా నా వంతుగా నిఘాను పెంచాను. సమిష్టిగా ఈ అభియోగాన్ని ఎదుర్కొనటం మా బాధ్యత. గతంలో 2021లో 50 వాహనాలు ట్రాన్స్‌పర్ చేయడంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ప్రస్తుతం చట్టం పరిధిలో దస్త్రాలు ఉన్నాయి. చట్టపరమైన చర్యలను తీసుకోవడానికి వారిపై క్రిమినల్ కేసులు కూడా పెట్టాం. పెద్ద ఎత్తున విస్తరించి ఉన్న రవాణా శాఖ పరిధిలో సిబ్బంది కొరత ఉండటం వల్ల కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నా సమిష్టిగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం మా బాధ్యతగా ముందుకు వెళుతున్నాము.

ప్ర : రోడ్ సేఫ్టీ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా రోడ్డు భద్రత మన బాధ్యత అనే క్రమంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 80 లక్షల రూపాయలను కేటాయించి కళ్యాణదుర్గం గుత్తి ప్రాంతాలలో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు కోసం పరికరాలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం ప్రతినెలా ప్రజలకు హెల్మెట్, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అనేక సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర : నిబంధనలు పాటించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ : ప్రభుత్వ నిబంధన అతిక్రమించి వ్యవహరిస్తున్న వారిపై రోడ్డు రవాణా శాఖ అధికారులు తగిన చర్యలను ఎప్పటికప్పుడు తీసుకుంటున్నారు. ప్రజా చైతన్యం కోసం ఒకపక్క కృషి చేస్తూ మరోవైపు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా ఓవర్ లోడ్ వాహనాలపై దృష్టి సారించాం. ప్రతి నెలా 200 కేసులు బుక్ చేస్తున్నాం. ఇదే క్రమంలో విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని స్కూలు బస్సులపై



నిఘా ఉంచాం.ఇప్పటివరకు 535 స్కూలు బస్సులు ఎఫ్సీని పూర్తిచేసుకుని రోడ్డుపై తిరుగుతున్నాయి 45 బస్సులు ఎఫ్‌సి చేసుకోలేదు. ఈ బస్సులను రోడ్డుపై తిప్పకూడదని యాజమాన్యాలకు తెలియజేశాం. ప్రజలు ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనలు పాటించడంతోపాటు చైతన్యం కావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

ప్ర : రవాణా శాఖ అధికారిగా ప్రజలకు మీ సూచన..

జ : ప్రజలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం ఎంతో అవసరం. ప్రతి క్షణం, నిమిషం, గంట విలువైనదే. అయితే అంతకన్నా విలువైనది ప్రాణం. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రధానంగా హెల్మెట్, సీటు బెల్టు, స్పీడ్ లిమిట్ వంటి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. తమ కుటుంబాలను గుర్తుచేసుకొని వ్యవహరించాలి.

8న విద్యాసంస్థల బంద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌యుఐ నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

విశాఖ ఉక్కు పరిరక్షణ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకై ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎన్‌ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శులు నవీన్‌కుమార్, అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం వారు విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసిందన్నారు. వేల మంది నిర్వాసితులు మారణాలు తెలిసే స్వలాభం కోసం 33 వేల ఎకరాల విస్తీర్ణం కలిగిన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక రూ. వెయ్యి కోట్ల వ్యయంతో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని నేటికీ నిర్మాణ పనులు చేపట్టలేదని మండిపడ్డారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకోవాలని, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని ప్రారంభించాలని లేనిచో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేయడంతో పాటు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యుఐ జిల్లా నాయకులు నందకుమార్, ఉపేంద్ర, కోన విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'బెస్ట్' యూనివర్సిటీ విద్యార్థుల ప్రదర్శన


బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని కమ్మరవాండ్లపల్లి వద్ద ఉన్న భారత్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ(బెస్ట్) కళాశాలకు చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ నాల్గో సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన కృషి ప్రదర్శన-2023 మహారాజ్ వ్యవసాయ ఎగ్జిబిషన్ రైతులను ఆకట్టుకుంది. 48 మంది విద్యార్థులు మండలం లోని వివిధ గ్రామాలకు వెళ్లి ఆయా ప్రాంతాల్లో పండిస్తున్న పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగానే ఆత్యాధునిక వ్యవసాయ పద్ధతులపై ఆదివారం కళాశాల ఆవరణలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మండలంలోని రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రైతులు అధిక దిగుబడి సాధించాలంటే పంటలకు ఎరువు ల వాడకం తగ్గించాలని, ఆవు పేడ ఎక్కువగా వాడాలని సూచించారు. వ్యవసాయ సామగ్రి, పనిముట్లను ప్రదర్శనకు ఉంచారు. పాడి పరిశ్రమపై రైతుల్లో మరింత ఆసక్తి పెంచేలా వివిధ రకాల గేదెలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్. బిలిజి, రిజిస్ట్రార్ నితిన్‌సోయ వన్షి, సిబ్బంది, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలోనే గిరిజనుల అభివృద్ధి

ఎస్టీ కమిషన్ సభ్యులు శంకరనాయక్


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వైసిపి హయాంలోనే గిరిజనులకు న్యాయం జరిగిందని, సిఎం జగన్ అమలుచేస్తున్న పథకాలతో అభివృద్ధి చెందామని ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ పేర్కొన్నారు. కదిరి పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్లు కలిసి ఉండేవని, జగన్ సిఎం అయిన తర్వాత వేర్వేరు చేశారన్నారు. అభివృద్ధి కూడా అమాంతం పెరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం తోనే తాము ఈ స్థాయిలో ఉన్నామని, సిఎం జగన్ తమకు చేసిన న్యాయాన్ని ఎన్నటికీ మరచిపోమన్నారు. పాడేరు ఐటిడిఎ ప్రాంతానికి మెడికల్ కాలేజీని మంజూరు చేసి అక్కడి గిరిజన విద్యార్థులు మెరుగైన విద్యనభ్యసించడానికి అవకాశం కల్పించారన్నారు. సిఎం జగన్ పుట్టపర్తి పర్యటనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ

తనకల్లు : రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాశయంతో ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని, విద్యార్థులు చదువు మీద దృష్టి పెట్టి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ సూచించారు. ఆయన ఆదివారం మండల పరిధిలోని సిజి ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడానికి ప్రణాళికలు రచించి ప్రభుత్వాన్ని ఒప్పించి విద్యార్థులు చదువు కోసం పట్టణాలు, బయట ప్రాంతాలకు వెళ్లకుండా మరింత మంది విద్యార్థులకు ఇక్కడే అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుస్మిత జోష్ణ, సిబ్బంది బాబు, ఆనంద్, జిపిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మల్లికార్జుననాయక్, రాంప్రసాద్‌నాయక్, భాస్కర్‌నాయక్, పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై రచనలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న రచయితలు

ప్రజాశక్తి-హిందూపురం

సామాజిక సమస్యలపై రచనలు చేయాలని పలువురు రచయితలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జిల్లా అధ్యక్షులు సిద్ధగిరి శ్రీనివాస్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరై 'సమాజం లో రచయితల పాత్ర'పై చర్చించారు. సమాజాన్ని పీడిస్తున్న సమస్యలను గుర్తించి వాటిపై పోరాటం చేసేలా రచయితలు తమ రచనలు చేయాలన్నారు. మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో క్రియాశీలక భాగస్వామ్యులుగా ఉండాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవరిచే విధంగా రచనలు ఉండాలని చర్చించారు. కార్యక్రమంలో అరసం జిల్లా గౌరవాధ్యక్షులు సడ్లపల్లి చిదంబరరెడ్డి, ఉపాధ్యక్షులు సొంటి జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఎన్.రాజశేఖర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి నాగమణి, సహాధ్యక్షులు ఏటిగడ్డ అశ్వర్థ నారాయణ, సహకార్యదర్శి గంగాధర్, ఉదయ్‌భాస్కర్, కార్యవర్గ సభ్యులు ధనాపురం వెంకట్రామ్‌రెడ్డి, పెనుకొండ రాజశేఖర్‌రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, ఒపిడిఆర్ శ్రీనివాసులు, బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

కె.శివరం సమస్యలు పట్టని పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-అమరాపురం

మండల పరిధిలోని కె.శివరం ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ కాలువలు పూడికతో పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై పారుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి మనోహర్‌శర్మను సంప్రదించగా 'డ్రెయినేజీలు శుభ్రం చేయాలని సిబ్బందిని ఒకటికి నాలుగు సార్లు ఆదేశించా.. వాళ్లు చేయకపోతే నేనేం చేయలేను.. నన్ను సస్పెండ్ చేసినా పర్వాలేదు.. నాకు ఒకటి కాదు, రెండు కాదు, మూడు పంచాయతీలు చూసుకోవాలి.. అందులోనూ చేతి నుంచి డబ్బులు ఇచ్చి బిల్లులు వచ్చేంత వరకూ మేము అప్పు తెచ్చుకొని వడ్డీ కట్టుకుంటున్నా' అని పేర్కొన్నారు. డ్రెయినేజీ కాలువల్లో చెత్త తొలగింపు విషయాన్ని సర్పంచి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కె.శివరం ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్ల రద్దుపై 'పల్లె' ఆగ్రహం


పింఛను రద్దయిన మహిళకు ధైర్యం చెబుతున్న పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారి పల్లెలో కేవలం రాజకీయ కక్షతో పలువురి పింఛన్లు రద్దు చేయడం పట్ల మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె ఆదివారం కమ్మవారిపల్లిలో ఓ ప్రయివేట్ కార్యక్రమానికి హాజరవగా గ్రామంలోని పింఛనుదారులు కలిసి సమస్యను వివరించారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలైన సందర్భంగా తాము సంబరాలు చేసుకున్నామని అది సహించలేక స్థానిక వైసిపి నాయకులు కక్ష గట్టి పింఛన్లను రద్దు చేశారని వాపోయారు. పల్లె మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలకు భయపడవద్దని, 2024లో టిడిపి అధికారంలోకి వస్తుందని అప్పుడు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో కొందరు అనారోగ్యంతో బాధపడుతుండగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. పల్లె వెంట నాయకులు ఊరువాకిలి సురేష్, దారపనేని చంద్రశేఖర్, కోనంకి గంగాధర్ తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి


సోమశేఖర్ (ఫైల్ ఫొటో)

హిందూపురం : రూరల్ మండల పరిధిలోని వీరంపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సోమశేఖర్(32) లేపాక్షి మండలం పులమతి గ్రామం బసవన్నపల్లి గ్రామ శివారులో ఉన్న తన పొలంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఇంటి నుంచే విధులు నిర్వహిస్తున్న సోమశేఖర్ పులమతి వద్ద ఉన్న సొంత మల్బరీ షెడ్‌ను నీటితో శుభ్రం చేస్తుండగా విద్యుత్ సరఫరా అయినట్లు అనిపించింది. దీంతో విద్యుత్ సరఫరా ఆఫ్ చేస్తామని ప్లగ్ స్విచ్ తాకగా వెంటనే షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే లేపాక్షి ఎస్ఐ, సిబ్బందితో ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సోమశేఖర్‌కు ఏడాదిన్నర క్రితం ఆశతో వివాహమైంది. ఏడాది బిడ్డ ఉన్నాడు. మృతుడి భార్య ఆశ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

చిలమత్తూరు : మండల పరిధిలోని మొరంపల్లి గ్రామ శివారులో వాస్మోల్ తాగి తర్వాత అక్కడే పొలం కంచెకు బెల్టుతో ఉరి వేసుకొని గోరంట్ల మండలానికి చెందిన శివ(25) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వి.గంగాధర్ తెలిపారు. శివ కోడూరు సమీపంలోని గార్మెంట్స్‌లో పని చేసే వాడని తెలిపారు. మొరంపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు బెదిరించడంతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకొన్నాడని శివ తండ్రి శ్రీరామప్ప ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ఓబుళదేవరచెరువు : స్థానిక బిసి కాలనీలో ఆదివారం మెకానిక్ వలి భార్య మెహ్రూన్(45) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. మెహ్రూన్ భర్తతో విడిపోయి పదేళ్లుగా ఒంటరిగా బిసి కాలనీలో కాపురం ఉంటుంది. ఆమె కుమార్తె హర్సియా గర్భిణి కావడంతో పుట్టింటికి వచ్చింది. తెల్లవారుజామున మెహ్రూన్ ఇంట్లో కనిపించకపోవడంతో కుమార్తె అంతటా పరిశీలించగా స్టోర్ గదిలో తల్లి పడి ఉండడం గమనించి దగ్గరికెళ్లి చూడగా అచేతనంగా పడి ఉంది. హర్సియా సమాచారం ఇవ్వడంతో సిఐ రాజన్న యాదవ్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమార్తె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హిందూపురం : స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆత్మహత్యకు యత్నిస్తున్న శశికు మార్‌ను హిందూపురం రూరల్ పోలీసులు రక్షించారు. వివరా లు.. మడకశిర నియోజకవర్గంలోని మనూరు పంచాయతీకు చెందిన శశికుమార్ హిందూపురం రైల్వే స్టేషన్ వద్ద ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులు డయల్ 100కు కాల్ చేసి తెలిపారు. దీంతో రూరల్ పోలీసులు హనుమంతరాయప్ప, రవికుమార్ హుటాహుటిన రైల్వేస్టేషన్ వెళ్లి అతడిని రక్షించి స్టేషన్‌కు తరలించారు. సిఐ శ్రీనివాసులు శశికుమార్‌కు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేసి వారికి అప్పగించారు.

బిఎల్‌ఒలు చిత్తశుద్ధితో పనిచేయాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

బిఎల్‌ఒలు చిత్త శుద్ధితో పని చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ముదిగుబ్బలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, టిడిపి నాయకులు తుమ్మల సూరి, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను మండలంలో బిఎల్‌ఒలు తూతూ మంత్రంగా నిర్వహించారని, అప్పుడే సమస్యను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పేర్కొన్నారు. దీంతో మండలంలో ఓటర్ల నమోదు ప్రక్రియ తప్పులతడకగా తయారు చేశారని, దొంగ ఓట్లు నమోదయ్యాయన్నారు. అర్హులైన ఎందరికో ఓటు హక్కు లేకుండా చేస్తున్నారని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బిఎల్‌ఒలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల సేవే యువర్స్ ఫౌండేషన్ లక్ష్యం


కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యనిపుణులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేదలకు సేవలందించడమే యువర్స్ ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. పట్టణం లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కర్నూలు నగరంలోని చక్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో చూపు మందగించిన 80 మందికి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించి 40 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్టు ఫౌండేషన్ అధ్యక్షుడు వైకె.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండే షన్ కోశాధికారి రాధాకృష్ణ, క్యాంప్ ఛైర్మన్ శీలానాగేంద్ర, రామచంద్రగుప్తా, డాక్టర్ బివి సుబ్బారావు, చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, నాగార్జున, శివప్రసాద్, రమేశ్‌బాబు, ప్రసాద్, జయరాం, నామాల శీన పాల్గొన్నారు.

తంబళ్లపల్లి ఎమ్మెల్యేని కలిసిన వైసిపి నేత

ప్రజాశక్తి-మడకశిర

మదనపల్లిలో ఆదివారం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని మడకశిర వైసిపి నాయకులు, న్యాయవాది హరేసముద్రం కె.అశ్వర్థనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకులు మద్దిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, వెంకటేశులు, శివశంకర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హాస్టల్ సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న బాబావలి

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక ప్రభుత్వ బాలుర బిసి వసతి గృహాన్ని ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు.

జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడిగా సామకోటి ఆది

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని సాయి ఆరామంలో ఆదివారం జిల్లా కురుబ సంఘం నాయకులు సమావేశమై జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా శివానంద, అధ్యక్షులుగా సామకోటి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా కేసాని ఆదినారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సామకోటి మాట్లాడుతూ కురుబల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కురుబ సంఘం బలోపేతం, వారి హక్కుల సాధనకై జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తామ న్నారు. మండల, నియోజక వర్గ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సామకోటి ఆదినారాయణ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


సామకోటి ఆదినారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

వైసిపి పాలనలో న్యాయ వ్యవస్థ నిర్వీర్యం


అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తున్న తెలుగుతమ్ముళ్లు

ప్రజాశక్తి మడకశిర

వైసిపి పాలనలో రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. దళితులపై దాడులను ఖండిస్తూ ఆదివారం గుండుమల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టి దళితుల ద్రోహి జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. గుండుమల మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3 వేల మందికి పైగా దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, సుబ్బరాయుడు, భక్తర్‌సాబ్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మంజునాథ్, కృష్ణమూర్తి, రవికుమార్, నగేష్, తిమ్మరాజు, సోము, రాజు, చెన్నప్ప, మల్లికార్జున, రమేష్, మంజు, రవి, వైవి.నాగరాజు, సంతోష్, తిమ్మయ్య, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక


గుండుమల సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో ఆదివారం పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీకి చెందిన 30 వైసిపి కుటుంబాలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. హరేసముద్రం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు వార్డ్ మెంబర్ జయరామప్ప, కరియన్న, నరసింహమూర్తి, రంగనాథ్, హనుమంతరాయప్ప, నవీన్‌కు మార్, తదితరులు టిడిపిలో చేరగా గుండుమల పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్, హరేసముద్రం నాయకులు కరియన్న, హనుమంతగౌడ, కొండంపల్లి నాగేంద్ర, మంజునాథ్, రామంజనేయులు, జయకుమార్, కృష్ణమూర్తి రమేష్, మంజు, నాగరాజు, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు వెరిఫికేషన్

ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని గుండుమల తిప్పేస్వామి సూచించారు. ఓటరు వెరిఫికేషన్, నమోదు కార్యక్రమంలో భాగంగా బిఎల్‌ఒ పట్టణంలోని 193వ బూత్‌లో ఓటరు నమోదు కోసం దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమాశంకర్, తిమ్మరాజు, రవిబాబు, నంజుండ, టి.సోము, ఎల్లోటి బద్రి, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బుక్కపట్నం

ఎన్టీఆర్ జిల్లాలో దళిత యువకుడుపై దాడి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు యశోదరాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ దళిత యువకుడిని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురిచేసిన మంత్రి ఆదిమూలపు సురేష్ అనుచరులను కఠినంగా శిక్షించాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో రోజురోజుకూ దళితు లపై దాడులు పెరుగుతున్నాయని వాపోయారు. ఈ ఘటనపైప మంత్రి ఆదిమూలపు సురేష్ స్పందించకపో వడం సిగ్గుచేటన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు జంగం వెంకటరాముడు, బాలు, సుబ్బారెడ్డి, సయ్యద్‌బాషా, షామీర్, వాజిద్, చెన్నప్ప, సుధీర్, మంజునాథ్, సతీష్‌కుమార్, గొర్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సెబ్ దాడులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యంపై సెబ్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం పెనుకొండ స్టేషన్ పరిధిలో పక్కా సమాచారంతో 44వ నెంబర్ జాతీయ రహదారిపై కాపుకాచి కారులో అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. తనకల్లు స్టేషన్ పరిధిలో కర్నాటక మద్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. హిందూపురం, తూముకుంట చెక్ పోస్ట్‌లలో రెండు కేసులు నమోదు చేసి కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరం స్టేషన్ పరిధిలోని అడవిబ్రాహ్మణపల్లిలో 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో అప్పగించారు.

నేడు 'స్పందన' రద్దు

పుట్టపర్తి రూరల్/ పుట్టపర్తి అర్బన్ : ప్రతి సోమవారం పట్టణంలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో నిర్వహించే 'స్పందన గ్రీవెన్స్' కార్యక్రమాన్ని ఈ నెల 6వ తేదీ(సోమవారం) రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 7వ తేదీ సిఎం జగన్ 'వైఎస్‌ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్' విడుదల చేసేందుకు పుట్టపర్తికి వస్తున్న నేపథ్యంలో 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛను అందజేసిన వాలంటీర్

ప్రజాశక్తి-అమరాపురం

మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామ సచివాలయానికి చెందిన గ్రామ వాలంటీర్ సోమశేఖర్ ఆదివారం బెంగళూరు వెళ్లి సప్తగిరి ప్రయివేట్ ఆస్పత్రిలో యూరిన్ సమస్యతో బాధపడుతున్న లబ్ధిదారుడు బిఎస్.మూర్తికి నవంబర్ నెల వృద్ధాప్య పింఛన్ మొత్తం రూ. 2750 అందజేసి ప్రజల మన్ననలు పొందాడు. ఇందుకు సహకరించిన గ్రామపంచా యతీ కార్యదర్శి, సర్పంచిలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సోమశేఖర్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని మల్లేపల్లి జడ్పి హైస్కూల్‌లో 1986-91లో చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. తొలుత అప్పటి గురువులను పూలమాలలతో సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కోసం భవిష్యత్తులో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించి తీర్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, రాజగోపాల్, ప్రస్తుత పిఇటి రజినీకాంత్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కొత్తచెరువురూరల్

మండల పరిధిలోని గోరంట్లపల్లి గ్రామానికి చెందిన మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతో పాటు బుక్కపట్నం జడ్పి హైస్కూల్‌లో 1989-90లో పదో తరగతి చదివిన చిన్ననాటి మిత్రులు ఆదివారం వారి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 25 వేలు ఆయన తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో చింతకాయల తిప్పన్న, సుబ్బారెడ్డి, భక్తవత్సలం, వేణుగోపాల్, తిప్పన్న, ఈశ్వరయ్య, షామీర్‌బాషా, నూరు, బాబాఫకృద్దీన్, చిన్నపరెడ్డి, నాగభూషణ్, టీచర్ తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.


మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బాల్య స్నేహితులు

కండక్టర్ నిజాయితీ
ప్రయాణికురాలి మొబైల్‌ఫోన్ అప్పగింత


మొబైల్‌ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ టీఐ, కండక్టర్లు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను ఆదివారం ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు, కండక్టర్ నరసింహులు సదరు ప్రయాణికుడికి అందజేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాలు.. ధర్మవరం నుంచి గోరంట్లకు వెళ్లే ఆర్టీసీ బస్సులో కొత్తచెరువుకు చెందిన గోవిందమ్మ రూ. 20 వేలు విలువ చేసే మొబైల్‌ఫోన్ మరచిపోయింది. ఆ తర్వాత కండక్టర్ నరసింహులు మొబైల్‌ఫోన్ తీసుకుని ప్రయాణికురాలికి సమాచారం ఇచ్చారు. దీంతో గోవిందమ్మ తన కుమారుడు పవన్‌కుమార్‌ను బస్టాండ్‌కు పంపగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు డిపో ఎడిసి మాధవ్, కండక్టర్ నరసింహులు, టిఎస్ మూర్తి మొబైల్‌ను అందజేశారు. కండక్టర్ నరసింహులును ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు అభినందించారు.


ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-కనగానపల్లి

మండల పరిధిలోని నెమలివరం, ఎలకుంట్ల గ్రామాల్లో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ బోయపాటి సుధాకర్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, భానుకోట నరసింహయాదవ్, పుజారి రాజాకృష్ణయాదవ్, బిల్లే దామోదర్, నరసంపల్లి ఆదెప్ప, లక్ష్మీనారాయణ, చవ్వల వెంకటేష్, సర్పంచి లెక్కల ముత్యాలప్ప, పరమేషప్ప, బాలు, వసంత్, రామన్న, బలిజ వెంకటేష్, అనితమ్మ, వైస్ సర్పంచి రామాంజనేయులు, కొండప్ప, డొల్లప్ప, వడ్డీ సంగప్ప, బిల్లే శ్రీనివాస్, సంగప్ప, నెమలివరం, ఎలకుంట్ల గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

మంద కృష్ణ మాదిగ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు రావాలని కోరుతూ ఆదివారం ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసాని వెళ్లి ఎమ్మెల్యే డాక్టర్ ఎం.తిప్పే స్వామికి ఆహ్వాన పత్రిక అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది మాదిగలు తరలి వెళ్లి జయప్రదం చేయా లని కోరారు. పట్టణంలోని ఎంఆర్‌పిఎస్, డిహెచ్‌పిఎస్, ఎంఇఎఫ్, అనుబంధ సంఘాల నాయకులు ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఆహ్వానించిన వారిలో డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హను మంతు, శ్రీరామ్, డాక్టర్ శివన్న, రామకృష్ణ, రంగప్ప తదితరులు ఉన్నారు.